సాక్షి
రాజన్న సిరిసిల్ల

బుధవారం । 1 । మే । 2024

బద్దిపోచమ్మకు బోనం

వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. నెత్తిన బోనాలతో పాదరక్షలు లేకుండా ఎండను సైతం లెక్కచేయకుండా డప్పుల చప్పుళ్లతో ఆలయం వద్దకు వెళ్లి అమ్మవారికి కల్లుసాక, ఒడిబియ్యం సమర్పించారు.



‘పది’లో టాప్ త్రీ

- రాష్ట్రంలో రాజన్న సిరిసిల్లకు 3వ స్థానం
- 99.03 శాతం బాలికలు.. 97.43 శాతం బాలుర ఉత్తీర్ణత

సిరిసిల్లఎడ్యుకేషన్: పదో తరగతి ఫలితాల్లో జిల్లా మెరుగైన స్థానాన్ని కైవసం చేసుకుంది. గతేడాది రాష్ట్రంలో 6వ స్థానంలో నిలవగా ఈసారి మూడో స్థానంలో నిలిచింది. ఫలితాలతో జిల్లా విద్యాశాఖ మెరుగైన ప్రణాళికతో ముందుకెళ్లినట్లు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

బాలికలదే పై చేయి..

జిల్లాలో 3,079 మంది బాలురు, 3,391 మంది బాలికలు మొత్తం 6,470 మంది పరీక్ష రాశారు. ఇందులో 3,000 మంది బాలురు, 3,358 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారు. జిల్లా మొత్తంలో 98.27 ఉత్తీర్ణత శాతం నమోదు చేసి రాష్ట్రంలో 3వ స్థానంలో నిలిపారు. కాగా, బాలికలు 99.03 ఉత్తీర్ణత శాతం నమోదు చేయగా బాలురు 97.43 శాతంతో వెనకంజలో ఉన్నట్లు విద్యాశాఖ గణాంకాలున్నాయి. అలాగే జిల్లాలో 111 మంది 10 జీపీఏ సాధించగా అందులో బాలికలు 77 మంది ఉండడం గమనార్హం.

వందశాతం ఉత్తీర్ణత..

జిల్లాలో 135 పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించిన జాబితాలో చేరాయి. వీటిలో జిల్లా పరిషత్ పాఠశాలలు 67 ఉండగా, 39 ప్రైవేటు పాఠశాలలు, 11 గురుకులాలు, 12 కేజీబీవీలు, 1 ప్రభుత్వ పాఠశాల, 4 మోడల్స్ స్కూల్స్ ఉన్నట్లు అధికారిక సమాచారం.

గీతానగర్ జెడ్పీ పాఠశాలలో..

అత్యధిక విద్యార్థులున్న గీతానగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 172 మంది పరీక్ష రాయగా 169 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు లోకిని శారద తెలిపారు. అలాగే మిట్టపల్లి రఘునందన్, దూస మనోజ్ 10 జీపీఏ సాధించిన వారిలో ఉన్నారు.

వందశాతం ఫలితాలతో..

సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ జిల్లా పరిషత్ పాఠశాల వందశాతం ఉత్తీర్ణత సాధించింది. నవ్వశ్రీ, అక్షయ, అభిషేక్, నందిని 9.8 జీపీఏ సాధించిన వారిలో ఉండగా 9.5 జీపీఏ నుంచి ఆ పైన జీపీఏ సాధించిన వారిలో 8 మంది ఉన్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. నెహ్రూనగర్ పాఠశాలలో 42 మంది విద్యార్థులు పరీక్ష రాయగా వందశాతం ఉతీర్ణులైనట్లు ప్రధానోపాధ్యాయురాలు భాగ్యరేఖ తెలిపారు. లాస్య, కృపాగ్న, హాసిని 9.7 జీపీఏ సాధించారు.



10 జీపీఏ సాధించిన గీతానగర్ స్కూల్ విద్యార్థులు రఘునందన్, మనోజ్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం శారద

జిల్లాలో ఉత్తీర్ణత శాతం ఇలా..

విద్యా సంవత్సరం	ఉత్తీర్ణత శాతం	రాష్ట్రంలో జిల్లా స్థానం
2023-24	98.27	3
2022-23	94.37	6
2021-22	95.76	7
2020-21	100	కరోనా
2019-20	100	కరోనా
2018-19	97.7	5

న్యూస్‌రీల్

ధాన్యం వివరాలు నమోదు చేయండి



అధికారులతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల: కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్‌లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించి ఐకేపీ, డీసీఎంఎస్, ప్యాక్స్, మెప్మా ఆధ్వర్యంలో ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం వివరాలు తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం తూకం వేయాలని, సంబంధిత డబ్బులను రైతుల బ్యాంక్ ఖాతాల్లో పడేలా చూడాలన్నారు. ఆయా సంస్థల ద్వారా ఇప్పటి వరకు 11,946 మంది రైతుల నుంచి 80,827 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు వెల్లడించారు. రూ.84 కోట్లు రైతుల ఖాతాల్లో వేశామన్నారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఠాణా నుంచి నిందితుడి పరార్

చందుర్తి(వేములవాడ): గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన నిందితున్ని విచారణ కోసం చందుర్తి పోలీసులు అదుపులో తీసుకోగా, నిందితుడు తప్పించుకున్నట్లు తెలిసింది. బోయినపల్లి మండలం గర్శకుర్తి గ్రామానికి చెందిన వ్యక్తి గంజాయి రవాణా చేస్తుండగా చందుర్తి మండలం మర్రిగడ్డ శివారులో సీసీఎస్ పోలీసులు పట్టుకుని స్థానిక పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. కాగా విచారణ అనంతరం రిమాండ్‌కు తరలించేందుకు పోలీసులు అదుపులో ఉంచుకోగా, సోమవారం రాత్రి విధుల్లో పోలీసుల కళ్లు గప్పి నిందితుడు తప్పించుకున్నాడు. ఎస్సై, సీఐకి సమాచారం ఇవ్వగా, రెండు బృందాలుగా గాలింపులు చేపట్టినట్లు తెలిసింది. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. కాగా నిందితుడి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తూనే ఉన్నారు. ఈ విషయమై చందుర్తి ఎస్సై శ్రీకాంత్‌ను వివరణ కోరగా, ఇంకా ఆచూకీ లభ్యం కాలేదని, గాలింపులు కొనసాగిస్తున్నట్లు వివరించారు.

గ్రూప్- 1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

సిరిసిల్లకల్చరల్: త్వరలో నిర్వహించే గ్రూప్-1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి నికోలస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జూన్ 9న జరిగే పరీక్ష నిర్వహణ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, విద్యుత్ సరఫరా, సీసీ కెమెరాల ఏర్పాట్లపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అభ్యర్థుల విస్తృత తనిఖీ, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. కాన్ఫరెన్స్ అనంతరం అదనపు కలెక్టర్ పూజారి గౌతమి మాట్లాడుతూ, జిల్లాలో 20 కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో ఏఎస్పీ చంద్రయ్య, ఆర్డీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్సీ స్టడీ సర్కిల్ సేవలను వినియోగించుకోవాలి

- అదనపు కలెక్టర్ పూజారి గౌతమి

సిరిసిల్లకల్చరల్: ఎస్సీ స్టడీ సర్కిల్ అందిస్తున్న శిక్షణ సదుపాయాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ పూజారి గౌతమి అన్నారు. మంగళవారం స్టడీ సర్కిల్‌ను సందర్శించి శిక్షణార్థులతో మాట్లాడారు. ప్రణాళిక ప్రకారం అధ్యయనం చేస్తూ నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. మూడు నెలల ఫౌండేషన్ కోర్సులో ఇప్పటి వరకు 50 మంది దరఖాస్తు చేసుకున్నారని, యువతీ, యువకులకు వేర్వేరుగా భోజనం, వసతి సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం మెస్, భోజన నాణ్యతను పరిశీలించారు. ఏర్పాట్లలో లోటుపాట్లు లేకుండా సర్కిల్ నిర్వహణ జరగాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్టడీ సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్సీ స్టడీ సర్కిల్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ పూజారి గౌతమి

అర్బన్‌బ్యాంకు ఓటరు లిస్టు ప్రదర్శన

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల అర్బన్‌బ్యాంకు ఎన్నికల ఓటరు లిస్టును మంగళవారం బ్యాంకు నోటీస్ బోర్డుపై ప్రదర్శించినట్లు జిల్లా సహకార శాఖ ప్రకటన విడుదల చేసింది. సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు ముసాయిదా లిస్టును విడుదల చేశారు. ఏదైనా మార్పులు, చేర్పులు ఉంటే ఈనెల 3వ తేదీ సాయంత్రం వరకు సహకార శాఖ జూనియర్ అసిస్టెంట్ రాజు, సిరిసిల్ల సహకార అర్బన్‌బ్యాంకు జూనియర్ అసిస్టెంట్ శంకర్, సహకార అర్బన్‌బ్యాంకు ఎల్లారెడ్డిపేట బ్రాంచ్ సీనియర్ అసిస్టెంట్ శివకుమార్‌ను సంప్రదించాలని అధికారులు పేర్కొన్నారు.

3న సిరిసిల్లకు సీఎం రేవంత్‌రెడ్డి రాక

సిరిసిల్లటౌన్: కార్మికక్షేత్రం సిరిసిల్లకు ఈనెల 3న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి రానున్నారు. మంగళవారం స్థానిక విద్యానగర్ బైపాస్ సమీపంలో సభాస్థలిని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పరిశీలించి మాట్లాడారు. పదేళ్లుగా బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల అరాచకం నుంచి ప్రజలు మార్పు కోరుతున్నారని పేర్కొన్నారు. ఈక్రమంలోనే గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు తెలంగాణ ప్రజలు స్వస్తి పలికారని, ఇప్పుడు కేంద్రంలో బీజేపీని కూడా ప్రజలు గద్దెదించుతారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా తమ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును ప్రజలు భారీ మెజార్టీతో గెలిపిస్తారన్నారు. సిరిసిల్లలో జరిగే భారీ బహిరంగ సభకు అన్నివర్గాల ప్రజలు పెద్దెత్తున తరలివస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణగౌడ్, గడ్డం నర్సయ్య, పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఆకునూరి బాలరాజు, వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్, నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, కుడిక్యాల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం సభాస్థలిని పరిశీలిస్తున్న మహేందర్‌రెడ్డి, నాయకులు

రేపు రాజన్న హుండీ లెక్కింపు

వేములవాడ: రాజన్నను దర్శించుకుని స్వామివారి హుండీల్లో వేసిన కట్నాలు, కానుకలను ఈనెల 2న ఉదయం 8 గంటల నుంచి లెక్కించనున్నట్లు ఈవో కృష్ణప్రసాద్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని ఆదేశించారు.

ప్రజల గుండెల్లో చోటు సంపాదించాం



సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి



జమ్మికుంట సభకు హాజరైన జనం

- కరీంనగర్ జిల్లా చైతన్యవంతమైంది
- ఎర్రజెండా నీడలో పేదలకోసం ఎన్నో పోరాటాలు జరిగాయి
- జమ్మికుంట జనజాతర బహిరంగసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, కరీంనగర్/సాక్షి, పెద్దపల్లి/హుజూరాబాద్: రాష్ట్ర సంక్షేమమే లక్ష్యంగా 100రోజుల్లో మంచి పథకాలు అమలు చేసి ప్రజల గుండెల్లో స్థానం సంపాదించామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తల కష్టంతోనే ఈ ప్రభుత్వం ఏర్పడిందని కొనియాడారు. రాష్ట్రంలో మూడునెలల్లో 30వేల ఉద్యోగాలు ఇచ్చామని పేర్కొన్నారు. రామప్ప శివుడి మీద ఒట్టేసి చెబుతున్నా ఆగస్టు 15లోగా తప్పకుండా రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మంగళవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అధ్యక్షతన జనజాతర బహిరంగసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కరీంనగర్ జిల్లా చైతన్యవంతమైందని అన్నారు. ఎర్రజెండా నీడలో ఎంతోమంది విప్లవకారులు పేదల కోసం పోరాటం చేశారని కొనియాడారు. ఎం.సత్యనారాయణరావు, చొక్కారావు, జువ్వాడి రత్నాకర్‌రావు లాంటి ఎందరో గొప్పవాళ్లను కరీంనగర్ జిల్లా అందించిందని వ్యాఖ్యానించారు. తెలంగాణ కోసం చింతమడక నుంచి వచ్చిన కేసీఆర్‌కు ఇక్కడి ప్రజలు అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. కరీంనగర్‌ను వదిలి కేసీఆర్ మహబూబ్‌నగర్ వస్తే తెలంగాణ కోసం గెలిపించామని అన్నారు. ఈ పదేళ్లలో మోదీ ఇచ్చింది ఏమీ లేదు.. కరీంనగర్‌కు బండి సంజయ్ తెచ్చింది ఏం లేదన్నారు. కరీంనగర్‌లో అరగుండు, నిజామాబాద్‌లో మరోగుండు రాష్ట్రానికి తెచ్చిందేం లేదని ఎద్దేవా చేశారు. రాముడి పేరు చెప్పుకొని ఓట్లు అడుక్కునే దిక్కుమాలిన పరిస్థితి కరీంనగర్, నిజామాబాద్ బీజేపీలో ఉందని విమర్శించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ మధ్య చీకటి ఒప్పందం జరిగిందన్నారు. అందుకే మహబూబ్‌నగర్, చేవేళ్ల, భువనగిరి, కరీంనగర్, మల్కాజ్‌గిరిలాంటి సీట్లలో బీజేపీని గెలిపించాలని కేసీఆర్ ఒప్పందం చేసుకున్నారన్నారు. నల్గొండ, మెదక్‌లాంటి సీట్లలో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును లక్షఓట్ల మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే కేంద్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరముందని సూచించారు. తాను ఎంపీగా రాష్ట్ర సాధన కోసం పోరాటం చేస్తూనే, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో అభివృద్ధి పనులు చేశానని గుర్తుచేశారు. బండి సంజయ్ కరీంనగర్ ఎంపీగా చేసిన అభివృద్ధి శూన్యమని అన్నారు. రాముని పేరు చెప్పి ఓట్లు అడగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఢిల్లీ పోలీసులు నోటీసులు ఇవ్వడం కక్షసాధింపు చర్యల్లో భాగమే అన్నారు. తెలంగాణ సెంటిమెంట్‌తో కేసీఆర్ ఎన్ని కుట్రలుచేసినా.. రేవంత్ ముఖ్యమంత్రి అయ్యారన్నారు. ప్రజాసేవకు పనికిరాని వ్యక్తి బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రాజేందర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ మాట్లాడుతూ.. 10ఏళ్ల పాలనలో దేశంలో నిత్యావసర ధరలు విపరీతంగా పెంచిన బీజేపీని ఈ ఎన్నికల్లో పాతాళంలోకి తొక్కాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఆస్తి పంపకాల్లో దాడి.. ఇరువర్గాలపై కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటకు చెందిన ఇరువర్గాల వారు తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఆస్తి పంపకాల విషయంలో పరస్పరం దాడి చేసుకోగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. కోరుట్లపేట గ్రామానికి చెందిన ఎగదండి రాజు, ఎగదండి సాయిప్రసన్న, ఎగదండి నర్సింలు, ఎగదండి సుజాత, ఎగదండి పద్మకు తమ తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఆస్తి పంపకాల విషయంలో కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ విషయంలో ఇరు కుటుంబాల సభ్యులు సోమవారం దాడి చేసుకున్నారు. ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదు చేసుకోగా మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి పట్టివేత

బోయినపల్లి(చొప్పదండి): మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ పరిసరాల్లో గంజాయి విక్రయించడానికి వస్తున్న వ్యక్తి నుంచి 129 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పృథ్వీధర్‌గౌడ్ మంగళవారం రాత్రి తెలిపారు. మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన అనిల్ బోయినపల్లిలో గంజాయి విక్రయించడానికి వస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. అనిల్‌ను పోలీసులు చాకచక్యంగా పట్టుకుని అతడి బైక్, గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అతడితో పాటు గంజాయి విక్రయించే గంగాధర, కొడిమ్యాల మండలాలకు చెందిన మొత్తం నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

సిరిసిల్లలో పిచ్చికుక్కల స్వైర విహారం


తీవ్రంగా గాయపడిన నారాయణ

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం సిరిసిల్లలోని కార్మిక వాడల్లో మంగళవారం పిచ్చికుక్కలు స్వైరవిహారం చేశాయి. ముగ్గురిని కరిచి హంగామా సృష్టించాయి. ఒకటో వార్డుకు చెందిన విలేజ్ కమిటీ మాజీ చైర్మన్ ఇటిక్యాల నారాయణ పొలం పనులకు వెళ్తుండగా కుక్కలు వెంబడించి కరిచాయి. ముఖంపై తీవ్ర గాయాలు చేయగా బాధితుడిని జిల్లాసుపత్రికి తరలించారు. అదే వార్డుకు చెందిన పోతుల తిరుపతి, వజ్రమ్మను కుక్కలు కరవడంతో తీవ్రగాయాలయ్యాయి. ఒకే రోజు ఒకే గ్రామం రగుడులో మూడు చోట్లలో కుక్కలు స్థానికులను కరవడంతో ప్రజలు ఆందోళన చెందారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతోనే కుక్కలు స్వైరవిహారం చేస్తూ..స్థానికుల ప్రాణాల మీదకు తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో గీత కార్మికుడి మృతి


సంపత్ (ఫైల్)

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కాట్రపల్లికి చెందిన ఓ గీత కార్మికుడు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. ముంజుల సంపత్(48) కల్లుగీత వృత్తితోపాటు వ్యవసాయ బావుల తవ్వకం పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం కాట్రపల్లికే చెందిన ఓ రైతు వ్యవసాయ బావి తవ్వుతుండగా విద్యుత్ షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఘటన స్థలానికి చేరుకొని, కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

‘పది’లో సత్తాచాటిన సర్కార్ స్కూళ్లు

- ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు

ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట/కోనరావుపేట/బోయినపల్లి/తంగళ్లపల్లి/వేములవాడరూరల్/వేములవాడఅర్బన్/చందుర్తి/రుద్రంగి/గంభీరావుపేట/వీర్నపల్లి: పదో తరగతి ఫలితాలు మంగళవారం వెలువడగా, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తాచాటారు. ముస్తాబాద్ ప్రభుత్వ పాఠశాలల, కస్తూర్బా విద్యాలయం, నామాపూర్ మోడల్ స్కూల్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించారు. మోడల్‌స్కూల్‌లో మోతె శివమణి, లహరిక, కరెడ్ల వెరోనికా, బందనకల్ జెడ్పీ స్కూల్ విద్యార్థిని పాతూరి ప్రణవి 10 జీపీఏ సాధించారు. కొండాపూర్ జెడ్పీలో వందశాతం ఉత్తీర్ణత సాధించగా, రేఖ 9.3, యాస్మిన్ 9.2 జీపీఏ సాధించారు. ఆవునూర్ జెడ్పీలో వంద శాతం ఉత్తీర్ణత సాధించగా రోర్ల చైతన్య, మోచ వర్షిణి 9.8, కోల సాత్విక 9.7 సాధించారు. గూడెం జెడ్పీ స్కూల్‌లో అందరూ పాసయ్యారు. నామాపూర్ స్కూల్‌లో సుష్మా 9.8, సంజయ్, అక్షయ 9.2, రాణి 9జీపీఏ, పోతుగల్ స్కూల్‌లో ఉమర్ 9.3, ముస్తాబాద్ బాలికల స్కూల్‌లో వంగ హర్షవర్ధన్ 9.5, ఆజ్మీర రక్షిత 9.3, ముస్తాబాద్ బాలుర గురుకులంలో అఖిలాష్, శ్రీకాంత్‌లు 9.8 జీపీఏ సాధించారు.


లహరిక వెరోనికా

రైతు ఇంటా సరస్వతీ పుత్రిక


ప్రణవికి స్వీట్ తినిపిస్తున్న లక్ష్మారెడ్డి, వనిత

బందనకల్ పాఠశాలలో చదివిన పాతూరి ప్రణవి 10 జీపీఏ సాధించింది. తండ్రి లక్ష్మారెడ్డి తనకున్న మూడెకరాల్లో వ్యవసాయం చేస్తూ కూతురు, కుమారుడు భువనేశ్వర్‌రెడ్డిని చదివిస్తున్నాడు. తల్లి వనిత టైలరింగ్. భవిష్యత్తులో కలెక్టర్ కావాలన్న ఆకాంక్షను ప్రణవి వ్యక్తం చేసింది.

దర్జీ దంపతుల ఆనందం


శివమణికి స్వీటు తినిపిస్తున్న లావణ్య, నర్సింలు

టైలరింగ్ వృత్తినే నమ్ముకుని పనిచేసే ముస్తాబాద్‌కు చెందిన మోతె లావణ్య, నర్సింలు కూతురు శివమణి 10 జీపీఏ సాధించింది. భవిష్యత్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావడమే లక్ష్యమని శివమణి పేర్కొంది.

ఎల్లారెడ్డిపేటలో..


మధురమీనాక్షి మనీషా

ఎల్లారెడ్డిపేట మండలంలో 10 ఉన్నత పాఠశాలలుండగా, ఏనిమిది స్కూళ్లలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. రాచర్లబొప్పాపూర్ పాఠశాలకు చెందిన మధుర మీనాక్షి, వెంకటాపూర్ నుంచి ఏ.శ్రీనిధి,అల్మాస్‌పూర్ నుంచి డి.రేఖ,వి.పల్లవి, దుమాలకు చెందిన ఐశ్వర్య, నారాయణపూర్ నుంచి ఇ.మనుశ్రీ, రాచర్లగొల్లపల్లి నుంచి ఎం.రీషిత 9.8 జీపీఏ సాధించారు. వందశాతం ఉత్తీర్ణత సాధించడం గర్వంగా ఉందని ఎంఈవో రఘుపతి తెలిపారు.

కోనరావుపేటలో..


జాప రుతిక డి.భరత్

పది ఫలితాల్లో కోనరావుపేట మండలం 99.2 శాతం ఉత్తీర్ణతను సాధించినట్లు ఎంఈవో రఘుపతి తెలిపారు. కనగర్తి పాఠశాలకు చెందిన జాప రుతిక 9.8, డి.భరత్ 9.8 జీపీఏ(నిమ్మపల్లి), ఒగ్గు వైశాలి 9.8 జీపీఏ(మోడల్ స్కూల్), ఇ.అక్షయ (సుద్దాల) 9.8 జీపీఏ సాధించారు. మరిమడ్ల, వట్టిమల్ల, బావుసాయిపేట, మామిడిపల్లి, కోనరావుపేట, నిజామాబాద్, కనగర్తి, సుద్దాల, ధర్మారం, కొలనూర్, మోడల్‌స్కూల్, కేజీబీవీల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించారు.

బోయినపల్లిలో..


శ్రీపతి ప్రణీత్ ఎస్.రమ్య

బోయినపల్లి మండలంలో 299 మంది విద్యార్థులకు 298 మంది ఉత్తీర్ణులు అయినట్లు ఎంఈవో శ్రీనివాసదీక్షిత్ తెలిపారు. మోడల్ స్కూల్‌లో శ్రీపతి ప్రణీత్, ర్యాగల్ల రవళిక, మ్యాన నందిని 9.8, కేజీబీవీలో ఎస్.రమ్య 9.8 జీపీఏ సాధించారు.

తంగళ్లపల్లిలో..


ఇ.హర్షిణి ఎం.హవీలా పి.జాగృతి ఎన్.నేహ కె.జీవన డి.ప్రణవి

తంగళ్లపల్లి మండలంలో జిల్లెల్ల జెడ్పీహెచ్‌ఎస్ తెలుగు, ఇంగ్లిష్ మీడియం, జుఎడ్పీహెచ్‌ఎస్ నేరెళ్ల, ఓబులాపూర్, కేజీబీవి తంగళ్లపల్లి, బద్దెనపల్లి గురుకుల పాఠశాల, నేరెళ్ల రెసిడెన్షియల్ స్కూల్, మైనారిటీ పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 641 మందికి 626 మంది పాసయ్యారు. నేరెళ్ల రెసిడెన్షియల్ స్కూల్‌లో ఇ.హర్షిణి, ఎం.హవీల, పి.జాగృతి, ఎన్.నేహ, కె.జీవన, డి.ప్రణవి, మోడల్ స్కూల్లో ఎం.సంతోష్, హర్షిత్ 10 జీపీఏ సాధించారు.

వేములవాడలో..


టి.నవ్య ఎం.హర్షిణి వి.మేఘన బి.అక్షయ

వేములవాడ మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల విద్యార్థులు ఎం.హర్షిణి, టి.నవ్య, వి.మేఘన, కస్తూర్బా పాఠశాలలో బూర అక్షయ 10 జీపీఏ సాధించారు. జ్యోతిబాపూలే, కస్తూర్బా, మారుపాక జెడ్పీ, చీర్లవంచ, శాత్రాజుపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు.

చందుర్తిలో..


మనిచరణ్ శ్రీజ

చందుర్తి మండలం మూడపల్లి పాఠశాల విద్యార్థి వట్టిమల్ల మనిచరణ్ 9.8, మల్యాల పాఠశాల విద్యార్థిని శ్రీధర శ్రీజ 9.5 జీపీఏ సాధించారు. మండలంలోని బండపల్లి, మర్రిగడ్డ, మూడపల్లి, నర్సింగాపూర్ స్కూళ్ల, కేజీబీవీలో వందశాతం ఉత్తీర్ణత సాధించారు.

రుద్రంగిలో..


మనోజ్ఞ

రుద్రంగి కేజీబీవీ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణులయ్యారు. కె.మనోజ్ఞ 9.8, వి.మైథిలి, జి.రచన 9.7 జీపీఏ సాధించగా, ఉపాధ్యాయులు అభినందించారు.

గంభీరావుపేటలో..

గంభీరావుపేట జెడ్పీ బాలుర, ఊర్దూమీడియం, కొత్తపల్లి, ముచ్చర్ల, దమ్మన్నపేట, నాగంపేట, గజసింగవరం, సముద్రలింగాపూర్, కేజీబీవీ, నర్మాల గురుకుల పాఠశాల విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించారు. కొత్తపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన శశాంక్, శివలాస్య, సౌజన్య, ప్రహర్ష, దమ్మన్నపేట మోడల్ స్కూల్‌కు చెందిన వైష్ణవి 10 జీపీఏ సాధించారు.

వీర్నపల్లిలో..


జ్యోత్స్న అనూష

వీర్నపల్లి జెడ్పీ, కేజీబీవీ, గర్జనపల్లి పాఠశాల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణులయ్యారు. కేజీబీవీ నుంచి జ్యోత్స్న 9.8, మోడల్ స్కూల్ నుంచి మాడ్గుల అనూష 9 జీపీఏ సాధించారు.

ప్రజావ్యతిరేకి బీజేపీని గద్దె దించుదాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


రామన్నపేటలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట(వేములవాడ): ప్రజా వ్యతిరేకి బీజేపీని గద్దె దించుదామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలం రామన్నపేట, కొలనూర్, గొల్లపల్లి(కొలనూర్), మర్తనపేట, ధర్మారం, నాగారం గ్రామాల్లో మంగళవారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చిన గ్యారెంటీ పథకాల్లో కొన్ని ఇప్పటికే అమలు చేస్తున్నామన్నారు. ఎన్నికల తర్వాత ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, విండో డైరెక్టర్ నాగిరెడ్డి, నాయకులు తిరుపతి, ఆగేశ్, రేకుల లక్ష్మారెడ్డి, బిగుళ్ల బాబు, గోపాల్, వెంకన్న, నవీన్, శ్రీనివాస్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

పరీక్షల సమయంలో తండ్రి మృతి..

- 7.2 జీపీఏ సాధించిన కొడుకు


తల్లి రేణుకతో శ్రవణ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన పుట్టి రవి–రేణుక దంపతుల కుమారుడు శ్రవణ్. పదోతరగతి పరీక్షల ప్రారంభం రోజే రవి మృతిచెందాడు. ఇంట్లో తండ్రి మృతదేహం ఉండగానే శ్రవణ్ తెలుగు పరీక్షకు హాజరయ్యాడు. తర్వాత వచ్చి, అంత్యక్రియలు నిర్వహించాడు. పుట్టెడు దుఃఖంలోనూ అన్ని పరీక్షలు రాసి, 7.2 జీపీఏ సాధించాడు. నాన్న ఆశయాలు నెరవేర్చేందుకు ఉన్నత చదువులు చదువుతానని తెలిపాడు.

ప్రాణం తీసిన కోడిగుడ్డు వివాదం

- భోజన సమయంలో ఘర్షణ.. వృద్ధుడి హత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ నాగేంద్రచారి

వేములవాడరూరల్: కోడిగుడ్డు విషయమై జరిగిన ఘర్షణ ఓ వృద్ధుడి ప్రాణం తీసింది. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపాల్టీ పరిధి హన్మక్కపల్లిలోని ఓ తోటలో జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాలు.. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం తేలుకుంట గ్రామానికి చెందిన మర్రిపల్లి రాజయ్య (64), వేములవాడ అర్బన్ మండలం రుద్రారం గ్రామానికి చెందిన ఆనంద్ కొద్దిరోజులుగా హన్మక్కపల్లిలోని ఓ తోటలో పని చేస్తున్నారు. సోమవారం రాత్రి భోజనం చేసే సమయంలో తనకు కోడిగుడ్డు వేయాలని రాజయ్యను ఆనంద్ కోరగా వేయకపోవడంతో ఇద్దరి మధ్య చిన్నపాటి వివాదం మొదలై ఘర్షణకు దారితీసింది. ఈక్రమంలో రాజయ్యపై ఆనంద్ రాడ్‌తో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మంగళవారం ఉదయం తోటి కార్మికులు తోట యజమాని మల్లేశంయాదవ్, పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ నాగేంద్రచారి, పట్టణ సీఐ వీరప్రసాద్, ఎస్‌ఐ అంజయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుక్క తెచ్చిన లొల్లి

- నాలుగేళ్ల క్రితం ఘటన
- ఒకరి మృతికి కారణమైన నిందితుడికి జైలు, జరిమానా

సిరిసిల్లక్రైం: నాలుగేళ్ల క్రితం పెంపుడు కుక్క తెచ్చిన లొల్లిలో ఒకరు మృతిచెందగా, మంగళవారం నిందితుడికి జైలుశిక్ష పడింది. పోలీసుల వివరాల ప్రకారం.. 2020 జూలైలో ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన బొమ్మెర అంజయ్య ఇంటి వద్ద అదే గ్రామానికి చెందిన రంగు నాగరాజు పెంపుడు కుక్క మూత్ర విసర్జన చేసింది. దీంతో అంజయ్య అభ్యంతరం తెలిపాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య గొడవ జరగగా అంజయ్యపై నాగరాజు దాడి చేశాడు. అంజయ్య స్పృహ కోల్పోవడంతో చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుమారుడు భీంచంద్ ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్‌ఐ వెంకటకృష్ణ కేసు నమోదు చేయగా, సీఐ బన్సిలాల్ కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ నర్సింగరావు వాదించగా, సీఎంఎస్‌లు శ్రీకాంత్, రవీంద్రనాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్, సీఎంఎస్ కానిస్టేబల్ నరేందర్ కోర్టులో 13 మంది సాక్షులను ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి ప్రేమలత కేసు పూర్వపరాలు పరిశీలించారు. నిందితుడు రంగు నాగరాజుపై నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

రూ.3.60 లక్షలు పట్టివేత

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని అంగడిబజార్‌లో పట్టణ ఎస్సై నరేశ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా అరవింద్‌నగర్‌కు చెందిన చెట్‌పల్లి రమేశ్ ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.లక్ష తీసుకెళ్తుండగా సీజ్ చేశారు. పట్టణ ఎస్సై మన్మథరావు ఆధ్వర్యంలో పాతబస్టాండ్‌లో వాహనాల తనిఖీ చేపట్టగా బుగ్గారం మండలం వెల్గొండ గ్రామానికి చెందిన జెల్ల సురేశ్ రూ.1.60 లక్షలు తీసుకెళ్తుండగా పట్టుకుని సీజ్ చేశారు. తహసీల్ చౌరస్తాలో జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన గుండు శంకర్ రూ.లక్ష తీసుకెళ్తుండగా ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసి నగదును డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్‌సెల్‌కు అప్పగించారు.

దూషించాడని కొట్టి చంపారు

- యువకుడి హత్య కేసులో ఇద్దరి అరెస్టు
- వివరాలు వెల్లడించిన సీఐ నీలం రవి

మల్యాల(చొప్పదండి): మల్యాల మండలం రాజారం గ్రామంలో ఈనెల 22న హత్యకు గురైన రామన్నపేట గ్రామానికి చెందిన ముస్కు మహిపాల్‌రెడ్డి కేసును పోలీసులు ఛేదించారు. మద్యం తాగి దూషించాడనే కారణంతోనే మహిపాల్‌రెడ్డిని హత్య చేశారని పోలీసులు వెల్లడించారు. కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. సంఘటనకు సంబంధించిన వివరాలను సీఐ నీలం రవి మండలకేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వెల్లడించారు. రామన్నపేటకు చెందిన ముస్కు మహిపాల్ రెడ్డి ఈనెల 22న రాజారం శివారులో హత్యకు గురైన విషయం తెల్సిందే. మృతుడి భార్య జమున ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. మహిపాల్‌రెడ్డి స్నేహితుడు, జగిత్యాలకు చెందిన మహేందర్ ఈనెల 22న జగిత్యాలలోని ఓ బార్‌లో మద్యం తాగేందుకు వెళ్లారు. అదే సమయంలో అక్కడికి మహేందర్ స్నేహితుడు, గొల్లపల్లి మండలం ఇబ్రాజీపల్లికి చెందిన సిద్దిబియా వచ్చాడు. ముగ్గురూ కలిసి మద్యం సేవించారు. ధరూరు శివారులోని వైన్స్‌షాప్ వద్దకు వెళ్లి మరోసారి మద్యం కొనుగోలు చేసి రాజారాం శివారు ఎస్సారెస్పీ కాలువ వద్ద ముగ్గురు కలిసి మద్యం తాగారు. మహిపాల్‌రెడ్డి బియాను దూషించడంతో గొడవ మొదలైంది. ఆగ్రహంతో మహిపాల్‌రెడ్డిని కొట్టి చంపారు. మృతదేహం ఆనవాళ్లు కనిపించకుండా ఆటోలో ఉన్న చద్దర్, పండ్లపెట్టెను మృతదేహంపై వేసి నిప్పు పెట్టి ఆటోలో పారిపోయారు. మల్యాల పోలీసులు కొండగట్టు స్టేజీ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో మహేందర్, సిద్దిబియా అనుమానస్పదంగా కనిపించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా నేరం చేసినట్లు అంగీకరించారు. వారిని అరెస్ట్ చేసి రెండు సెల్‌ఫోన్లు, ఆటో స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

మల్లేశం మృతి తీరనిలోటు

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి


మల్లేశం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న వెంకట్‌రెడ్డి, నాయకులు

సిరిసిల్లటౌన్: సీపీఐ నాయకుడు సామల మల్లేశం మృతి కార్మిక లోకానికి తీరని లోటని ఆపార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం సిరిసిల్ల కార్మిక భవనంలో నిర్వహించిన సంతాపసభలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం బీవైనగర్‌లోని మల్లేశం కుటుంబ సభ్యులను పరామర్శించి మాట్లాడారు. కమ్యూనిస్టుల పోరాటంలో భాగంగా నిరుపేదలకు ఇళ్ల స్థలాలకోసం మల్లేశం అలుపెరుగని పోరాటం చేశారన్నారు. అప్పటి నేతల పోరాటంతోనే ప్రభుత్వం సిరిసిల్ల రాయిన్‌చెరువులో వేలాది మంది పేదలకు ఇండ్ల స్థలాలను అందించిదన్నారు. బీడీ పరిశ్రమ సంక్షోభాన్ని ఎదుర్కొన్న సమయంలో కార్మికుల తరుపున ముందు నిలిచి ప్రభుత్వంతో పోరాడారన్నారు. కార్మికుల హక్కుల సాధనలో మల్లేశం చేసిన సేవలు, పోరాట పటిమ ఎనలేనిదని కొనియాడారు. అటువంటి గొప్ప నాయకుడిని కోల్పోవడం కార్మిక లోకాన్ని తీరని శోకంలో ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, అజ్జ వేణు, మీస లక్ష్మన్, పంతం రవి, నల్ల చంద్రమౌళి, సోమ నాగరాజు తదతరులు పాల్గొన్నారు.

మేడే విజయవంతం చేయండి



మాట్లాడుతున్న కోడం రమణ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ప్రపంచ కార్మిక దినోత్సవం మే డేను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కార్యాలయంలో కుడిక్యాల కనకయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరై మాట్లాడారు. 138 వ మే డేను కార్మిక, కర్షకులు ఘనంగా జరుపుకోవాలని, బుధవారం ఉదయం 9 గంటలకు తంగళ్లపల్లి మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయం వద్దకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఆసాముల సంఘం నాయకులు గోనె పర్శరాములు, అవదూత హరిదాసు, కోడం వేణు, రాజమల్లు, రాంనారాయణ తదితరులు పాల్గొన్నారు.